ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



జగిత్యాల
5★★
జిల్లా వార్తలు
శనివారం 6 జనవరి 2024

ఘనంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు 8లో..

దళితులను మోసం చేసిన ఘనుడు కేసీఆర్ 7లో..



జగిత్యాలలో వంట కార్మికుల ర్యాలీ (ఫైల్)

'మధ్యాహ్నం'.. అప్పుల పాలు

- భారీ మొత్తంలో భోజన బకాయిలు
- బంగారు నగలు తాకట్టు పెట్టి వండి పెడుతున్న కార్మికులు
- పెరిగిన కూరగాయలు, గుడ్డు ధరలతో అవస్థలు
- గౌర వేతనమూ ఆలస్యమే

జగిత్యాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పప్పులు, ఉప్పుల ధరలు పెరిగిపోయే. మార్కెట్లో కూరగాయలు కొనుగోలు చేసేటట్లు లేకపోయే. వచ్చే జీతం తక్కువ. అప్పో..సొప్పో చేసి వంట చేయడం తప్పదు. నెలలు గడుస్తున్నా బిల్లులు రావాయే. ఐదు రూపాయల చొప్పున వడ్డీకి తెచ్చినా వచ్చే బిల్లులు సకాలంలో రాకపో వడం...అప్పులు ఇచ్చినోళ్లు ఆగుతలేరాయే. ఏం చేద్దాం... ఇదీ వంట ఏజెన్సీ ఓ నిర్వాహకురాలి ఆవేదన.

మధ్యాహ్న భోజన కార్మికులకు సకాలంలో బిల్లులు అందక, నెల నెల వేతనాలు రాక వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. నెలలుగా భారీ మొత్తంలో బిల్లులు బకాయిలు పేరుకుపోవడంలో పడరాని పాట్లు పడుతున్నారు. పాత అప్పు తీరడం లేదు.. కొత్తగా అప్పు పుట్టడం లేదు. మరో వైపు నిత్యవసర సరుకులు, కూరగాయల ధరలు రోజు రోజుకూ పెరుగుతుండటంతో మధ్యాహ్న భోజనం నిర్వహణ భారంగా మారుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్నం భోజనం ఏ జెన్సీలకు బిల్లులు సకాలంలో అందడం లేదు. కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో నిర్వాహ కులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు పోషకాలతో కూడిన నాణ్యమైన భోజనం పెట్టి ప్రభు త్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే సంక ల్పంతో ప్రధానోపాధ్యాయుల పర్యవేక్షణ కొరవడడం తో ఈ పథకం అమలు గాడి తప్పింది.

జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లాలోని 783 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నారు. జిల్లాలో 55,030 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందుతోం ది. ఇందులో 38,002 మంది ప్రాథమిక, 17,028 మంది ప్రాథమికోన్నత పాఠశాలలున్నట్లు విద్యాశాఖ రికార్డులు తెలుపుతున్నాయి. సుమారు 10,387 మంది పదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,566 మంది వంట కార్మికులు పని చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం కోసం ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఒక్కో విద్యార్థికి 5.45 రూపాయలు ఇస్తున్నారు.

అలాగే 6-10వ తరగతి వరకు విద్యార్థికి రూ. 8.17 పైసలు చెల్లిస్తున్నారు. గుడ్డు బిల్లు సపరేటుగా ఇస్తున్నారు. జిల్లాలో నెలకు సుమారు రూ. కోటి వరకు మధ్యా హ్న బిల్లులు అవుతుంటాయన్న అంచనా ఉంది.

గౌరవ వేతనంలో జాప్యం...

జిల్లాలో సుమారు 1,566 మంది మధ్యాహ్న భోజన కార్మికులు పనిచే స్తున్నారు. నెలకు రూ. వేయి రూపాయల చొప్పున ప్రభుత్వం గౌరవ వేత నం అందిస్తోంది. వారికి నెలకు రూ. 15.66 లక్షలు ఇవ్వాల్సి ఉంది. ఏడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని అంటున్నారు.

పెరిగిన గుడ్డు ధరతో సతమతం..

మెను ప్రకారం వారంలో మూడు సార్లు కోడిగుడ్లను అందించాలి. ప్రస్తుతం కోడిగుడ్లను ధరలకు రెక్కలు రావడంతో ఏజెన్సీల నిర్వాహకులు సతమతమవుతున్నారు. ప్రభుతం ఒక కోడిగుడ్డుకు రూ. 5 చెల్లిస్తుంది. అయితే మార్కెట్‌లో గుడ్డు ధర రూ. 6 పలుకుతోంది. అలాగే కూరగాయల ధరలు చుక్కలనంటాయి. పెరిగిన నిత్యావసర సరుకులతో గిట్టుబాటు కావడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు వాపోతున్నారు.

అటకెక్కిన కేసీఆర్ హామీ..

మధ్యాహ్నం భోజన కార్మికుల వేతనాన్ని పభుత్వం రూ. 2 వేలు పెం చినట్టు గతంలో అప్పటి సీఎం కేసీఆర్ ప్రకటించారు. అంతకు ముందు ఇస్తున్న వేయ్యి రూపాయలతో కలిపి ప్రతి నెలా వారికి రూ. మూడు వేలు ఇవ్వాల్సి ఉంది. కానీ అదేమీ అమలు కావడం లేదు. ఈ గౌరవ వేత నం పెంచుతున్నట్టు 2022 మార్చి బడ్జెట్ సమావేశాల్లో కేసీఆర్ హామీ ఇచ్చారు. తదనంతరం ఎన్నో పోరాటాల తర్వాత 2023 ఫిబ్రవరి 3వ తేదీన జీవో ఎంఎస్ నంబర్-8ని విడుదల చేశారు. జీవో విడుదలై నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ దానిని అమలు చేయడం లేదు.

ఆందోళన బాటలో వంట కార్మికులు...

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వంట కార్మికులు సమస్యల పరిష్కారానికి ఆందోళన బాటను ఎంచుకుంటున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయ గేటు వద్ద ధర్నా, ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. సమ స్యలు పరిష్కరించకుంటే పాఠశాలల్లో భోజనం వండడాన్ని నిలిపివేస్తా మని అధికారులకు తెలిపారు. ఈనెల 20వ తేదిలోగా సమస్యలు పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు. లేదంటే తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని అంటున్నారు.

అప్పుల పాలవుతున్నాం: తోట పోశాని, వంట కార్మికురాలు, ధర్మపురి



ఏడు నెలలుగా మధ్యాహ్న భోజన బిల్లులు అం దడం లేదు. బిల్లులు సక్రమంగా అందక పోవ డంతో కిరాణ షాపుల్లో అప్పులు పెరిగి పోతు న్నా యి. కొందరు వ్యాపారులు సరుకులు ఇవ్వడం లేదు. నిత్యావసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. గౌరవ వేతనం రూ. 3 వేలకు పెంచినా ఇప్పటికీ రాలేదు. పెండింగ్‌లో ఉన్న బి ల్లులు వెంటనే చెల్లించాలి. లేదంటే వంట నిలిపివేస్తాం.

ఎప్పుడూ ఇదే పరిస్థితి: లింగంపల్లి లక్ష్మి, వంట కార్మికురాలు, పెగడపల్లి



మధ్యాహ్న భోజన బిల్లులు సకాలంలో ఇవ్వడం లేదు. ప్రతీసారీ మూడు నాలుగు నెలలు కలిపి ఇస్తు న్నారు. దీంతో అప్పులు చేయాల్సి వస్తుంది. కిరాణషాపులో అప్పుగా రెండు నెలలు సరుకులు ఇస్తున్నారు. మూడో నెల ఇచ్చేందుకు కసురుకుంటున్నాడు. ప్రతి నెలా బిల్లులు చెల్లించాలి. నెలకు ఇస్తున్న మా వేతనం వేయితో పాటు పెరిగిన వేతనాన్ని అమలు చేయాలి.

సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తప్పదు: చిట్టన్నోజు గంగాధర్, వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు



మధ్యాహ్న భోజన వంట కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి. పెండింగ్‌లో ఉన్న ఏడు నెలల వేతనం చెల్లించాలి. గౌరవ వేతనా న్ని రూ. 10,500కు పెంచాలి. పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, వేతనాలు అందించాలి. కోడి గుడ్ల ధర రూ. 5 నుంచి రూ. 7 వరకు పెంచి బిల్లులు చెల్లించాలి. సమస్యలు పరిష్కరించకుంటే వంటలు నిలిపివేస్తాము.

స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల టౌన్, జనవరి 5 : పోలీస్‌స్టేషన్ పరిసరాలను నిత్యం పరి శుభ్రంగా ఉంచుకోవాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఆవరణలో పోలీస్ అధికారుల ఆధ్వర్యంలో శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి పరిసర ప్రాంతాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ఆహ్లాదకరమైన వాతావరణం కలిగించే విధంగా పరిసరాలను ఉంచాల్సిన బాధ్యత ప్రతి పోలీస్ అధికారిపై ఉందన్నారు. డీఎస్పీ వెంకట స్వామి, సీఐ నటేష్ ఉన్నారు.

ఇంటింటికీ ఆయోధ్య రామయ్య అక్షింతలు



ఎమ్మెల్యే సతీమణికి తలంబ్రాలు అందజేస్తున్న భక్తులు

జగిత్యాల టౌన్, జనవరి 5 : ఇంటింటికీ ఆయోధ్య రామయ్య అక్షింతలు అందజేసే కార్యక్రమాన్ని భక్తులు శుక్రవారం జిల్లా కేంద్రంలో కన్నుల పండువగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అన్ని వార్డుల్లో శ్రీరామ భక్తులు అయోధ్య నుంచి వచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని డప్పు, చప్పుళ్ల మధ్య, మహిళలు కోలాటాలు వేస్తూ అందజేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గృహానికి భక్తులు చేరుకోగా ఆయన సతీమణి రాధిక మంగళహా రతితో స్వాగతం పలికి అక్షింతలు అందుకున్నారు. శ్రీరామ భక్తులు తదితరులు ఉన్నారు.

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో శుక్రవారం అన్ని కుల సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామంలో ఊరేగింపుగా వెళ్తూ భజన చేశారు. ఈ కార్యక్రమంలో అన్ని కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని పలు కాలనీల్లో శ్రీరాముని అక్షింతలను ఇంటింటా శుక్రవారం పంపిణీ చేశారు. అక్షంతల వితరణ కార్యక్రమంలో భాగంగా ధర్మపురి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వార్డుల్లో ఇంటింటా తిరుగుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మకు శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. నేతలు మాట్లాడుతూ ప్రస్తుతం రామసేవలో పాల్గొని, రాబోవు తరాలకు ఆదర్శంగా నిలుద్దామని తెలిపారు. ప్రతి హిందూ బంధువు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ధర్మపురి మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, వీహెచ్‌పీ నేతలు, సభ్యులు పిల్లి శ్రీనివాస్, కస్తూరి రాజన్న, సంగి ఆనంద్, రేణికుంట మనోహర్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, రమేష్, ఆసం సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయికల్, జనవరి 5: విద్యుత్ సబ్ స్టేషన్‌ల మరమ్మతుల దృష్ట్యా రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ హరీష్ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతులు, 33 కేవీ అల్లీపూర్ లైన్ మెయింటనెన్స్ దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలి

చందుర్తి, జనవరి 5: ప్రతినెలా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను రద్దు చేయాలని చందుర్తి, రుద్రంగి మండలాల ఉపాధ్యాయులు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌ను కోరారు. మూడపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయ సంఘ నేతలు మాట్లాడారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించ డంతో విద్యార్థులకు బోధించే పని దినాలు తగ్గుతున్నాయని తల్లిదండ్రుల అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారన్నారు. సమావేశాలను రద్దు చేయాలని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయుడు మల్లేశంకు వినతి పత్రం అందజేశారు.

అధ్యాపకుల ఔదార్యం.. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మల్యాల, జనవరి 5: డ్రాప్‌అవుట్ తగ్గించడంతో పాటు విద్యార్థుల్లో మరింత ఉత్సాహం నింపి మెరుగైన ఫలితాలు సాధించడానికి మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తమ ఔదార్యంతో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల కోసం కళాశాల అధ్యాపకులు తమ సొంత ఖర్చులను వెచ్చించి మధ్యాహ్న భోజనం ఏర్పాటుకు ముందుకు వచ్చారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభం అయ్యే వరకు నిత్య భోజన ఖర్చులు భరించి విద్యార్థులకు అందించనున్నారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభించి వడ్డించారు. కళాశాల అధ్యాపకులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, అధ్యాపకులు దమ్మయ్యగారి శ్రీకాంత్, కాశవేణి శ్రీనివాస్, అత్తినేని శ్రీనివాస్, నవాబు, వెనేపల్లి సంధ్య, రచన, పూర్ణిమ, శ్రీధర్, నరేష్, శ్రీనివాస్ లైబ్రేరియన్ లక్ష్మీనారాయణతో పాటు కొమురయ్య, లయాక్‌అలీ విద్యార్థులు పాల్గొన్నారు

విజేతలకు ప్రైజ్‌మనీ అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాజేందర్

జగిత్యాలరూరల్, జనవరి 5 : జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్ గ్రామంలో శుక్రవారం బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించి విజేతలకు ప్రైజ్‌మనీతో పాటుగా మెమెంటోలను అందజేశారు. జగిత్యాల కాంగ్రెస్ రూరల్ మండల శాఖ అధ్యక్షుడు జున్ను రాజేందర్ అధ్వర్యంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

ఆర్థికసాయం అందజేత

జగిత్యాలరూరల్, జనవరి 5 : జగిత్యాల రూరల్ మండలంలోని హబ్సీపూర్ గ్రామానికి చెందిన ఇమ్మడి మహేష్ ఇటీవలే రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మానవతా దృక్పథంతో స్పందించిన హబ్సీపూర్ గ్రామస్థులు, సర్పంచ్ మారు రాజే శ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. లక్ష 6 వేలు మహేష్ భార్య, పిల్లల పై పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. అలాగే కల్లెడకు చెందిన మహేష్ స్నేహితులు రూ. లక్ష పోస్టాఫీస్‌లో జమ చేసి తమ మానవత్వాన్ని చాటుకున్నారు. బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ రమేష్, గ్రామకారో బార్ తిరుపతి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కొనసాగిన ప్రజాపాలన'

రాయికల్, జనవరి 5: రాయికల్ పట్టణంలోని 4వ వార్డుతో పాటు మండలంలోని అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాలను అధికారులు నిర్వహించారు. ప్రజల వద్ద నుంచి దరఖాస్తులను స్వీకరించారు. పట్టణంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు దరఖాస్తులు స్వీకరించారు. రాయికల్ ఎంపీడీవో సంతోష్ కుమార్, తహసీల్దార్ ఎండీ ఖయ్యూం ప్రజాపాలన గ్రామ సభలను పర్యవేక్షించారు.

నైతికంగా తప్పుకోవాలి

సిరిసిల్ల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నామినేటెడ్ పదవులు పొంది కొనసాగుతున్న వారు నైతికంగా తప్పుకోవాలని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి చీటి ఉమేష్ రావు ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం తొలగించే వరకు చూడకుండా గౌరవ ప్రదంగా తప్పుకోవాలని పేర్కొన్నారు. 54 మంది వివిధ కార్పొరేషన్ చైర్మన్లను, గ్రంథాలయ సంస్థ చైర్మన్లను తాజాగా ప్రభుత్వం తొలగించిందని, మిగిలిన వారు కూడా తప్పుకోవాలని కోరారు.

ప్రమాదాల నివారణకు డివైడర్లను తొలగించాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



ధర్మపురిలో వివేకానంద చౌరస్తా కూడలి పరిశీలిస్తున్న అడ్లూరి

ధర్మపురి, జనవరి 5: రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే డివైడర్లను తొలగించాలని ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని వివేకానంద చౌరస్తా కూడలిని అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇంజనీరింగ్ పర్యవేక్షణ లేకుండా డివైడర్ల నిర్మాణం చేపట్టడంతో కూడళ్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ప్రమాదాలకు కారణమైన డివైడర్లను వెంటనే తొలగించాలని ఆదేశించారు. రెండు ప్రదేశాల్లో వెంటనే పనులు చేపట్టి ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ, పీఆర్ ఈఈలు శ్రీనివాస్, రహమాన్, డీఈఈ సత్యనారాయణ, ఏఈఈ సతీష్, కమిషనర్ రమేష్, సీఐ రమణమూర్తి, ఎస్ఐలు దత్తాత్రి, రామక్రిష్ణ, టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్ పాల్గొన్నారు.

● అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వ భూమి అందించేలా చేస్తామని ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గాదెపల్లి, కొసునూర్‌పల్లె శివారులో గల ప్రభుత్వ భూమిని సంబంధిత శాఖ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 2011 నుంచి ప్రజలు తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడుకునేందుకు పోరాటం చేస్తున్నారన్నారు. ఫారెస్ట్ భూమిని డి ఫారెస్ట్ భూమిగా మార్చి 100 మంది పేదలకు అప్పటి ప్రభుత్వం పట్టాలు అందించిందన్నారు. ఆ భూములకు హద్దులు చూపించకుండా ఇబ్బందులకు గురి చేసిందన్నారు. ఈ విషయమై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

తోటకు విద్యుత్ కంచె

- విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్ర గాయాలు


గాయపడ్డ యువకుడు

చందుర్తి, జనవరి 5: అటవీ జంతువుల నుంచి కూరగాయల తోటను కాపాడుకునేందుకు తోట చుట్టూ కంచెను ఏర్పాటు చేయగా, విద్యుత్ కంచెను గమనించని పక్క చేను రైతు విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చందుర్తి మండలం రామన్నపేట గ్రామానికి చెందిన నవీన్ రెడ్డి అనే యువకుడు గత నెల తన పక్క కూరగాయల తోటలోకి వెళ్లగా విద్యుదాఘాతానికి గురై స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడే ఉన్న అతడి భార్య కూడా విద్యుదాఘాతం నుంచి తప్పించుకొని సమీపంలో ఉన్న రైతుకు సమాచారం ఇచ్చింది. ట్రాన్స్‌ఫార్మర్‌ను బంద్ చేసి గాయపడిన రైతును 108 అంబులెన్స్‌లో వేములవాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కాగా గ్రామంలో కొందరు వేటగాళ్లు కూడా విద్యుత్ షాక్‌తో వన్యప్రాణులను వేటాడి విక్రయిస్తున్నట్లు గ్రామస్థులు పేర్కొంటు న్నారు. విద్యుత్ కంచెలు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జనవరి 5: నగరంలోని కట్టరాంపూర్ ప్రాంతానికి చెందిన బండమీది రాజ్‌కుమార్ (38) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజ్‌కుమార్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటాడు. ఇంట్లోనే రాత్రి 8 గంటల ప్రాంతంలో ఉరివేసుకోగా అతని భార్య గమనించి స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించేసరికి మృతి చెందాడు. ఆత్మహత్యకు కారణాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 5: కొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం యువతి కావ్యశ్రీపై కత్తితో దాడి చేసి హత్యకు ప్రయత్నించిన కేసులో నిందితుడు బొద్దుల సాయిని అరెస్టు చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. మూడేళ్ల నుంచి ప్రేమిస్తున్నప్పటికీ తనను పెళ్లి చేసుకునేందుకు నిరాకరించడంతో ఆమెను హత్య చేసేందుకు వెళ్లి ఆమె గొంతుపై కత్తితో గాయపరిచానని నిందితుడు ఒప్పుకున్న ట్లు సీఐ తెలిపారు. కొత్తపల్లిలోని తన ఇంటి వద్దనే నిందితుడు సాయిని అరెస్టు చేసి, దాడికి ఉపయోగించిన కత్తిని సీజ్ చేశామని తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ వివరించారు.

ఒకరి అరెస్టు

సిరిసిల్ల క్రైం, జనవరి 5: భార్యపై హత్యాయత్నం కేసులో భర్తను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలం విట్టల్‌నగర్‌కు చెందిన బోయిన శ్రీకాంత్‌తో సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన సౌజన్యను అన్ని లాంచ నాలు ఇచ్చి వివాహం చేశారు. ఆ తర్వాత సౌజన్యకు వేధింపులు పెరిగాయి. అదనంగా రూ.5 లక్షలు కట్నం తేవాలని బెదిరించి కిరోసిన్ పోసి హత్యకు యత్నించాడు. బాధితురాలి ఫిర్యాదుతో భర్త శ్రీకాంత్‌ను అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 5: సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో రవి అనే వ్యక్తిపై దాడిచేశారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న రవిపై బైపాస్ మూలమలుపు వద్ద ముగ్గురు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి అకస్మాత్తుగా కర్రలతో దాడి చేశారు. అంతటితో ఆగకుండా కిందపడేసి కొట్టారు. ఈసంఘటనపై ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉపేందర్ తెలిపారు.

ఆరు గ్యారెంటీలు పక్కాగా అమలు చేస్తాం

- హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం
- ఓటు వేసి గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు
- ముఖ్య కార్యకర్తల సమావేశంలో పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

సైదాపూర్, జనవరి 5: ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని రవాణ శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సైదాపూర్ మండల కేంద్రంలో ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొంత సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే గెలిచి, మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటి సారిగా మండలానికి వచ్చిన మంత్రిని కార్యకర్తలు సన్మానించారు. తహసీల్దార్ దూలం మంజూల, ఎంపీడీవో పద్మావతి, ఎంపీవో సురేందర్, ఏపీఎం కుమారస్వామి, వివిధ శాల అధికారులు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛ అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు మంత్రులను, ఎమ్మెల్యేలను, అధికారులను కలువడానికి ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ఇది ప్రజా పాలన అని ప్రజలు ఎప్పుడైన తమను కలువవచ్చన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకవస్తే పరిష్కరిస్తానన్నారు. హుస్నాబాద్ నియోజక వర్గానికి దేవాదుల, శ్రీరాంసాగర్, మిడ్ మానేరు నీరు పూర్తి స్థాయిలో తీసుకవచ్చి నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. పనులు నడులు కూడా ప్రారంభించామన్నారు. హుస్నాబాద్ కార్యాలయం ఎల్లవేళలా తెరచి ఉంటుందని, తాను లేక పోయినా అక్కడ ఉన్నవారు అర్జీలు తీసుకుంటారన్నారు. మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్య శ్రీ అమలు చేశాం. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల తమకు ఆదాయం రావడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఇష్టం ఉందో, లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఆరున్నర కోట్ల జీరో టికెట్లు అమ్ముడు పోయాయని వివరించారు. రవాణాశాఖ మంత్రిగా చొరవతీసుకొని ఆర్థిక శాఖ మంత్రితో మాట్లాడి ఆర్టీసీకి నష్టం వాటిల్లకుండా ఎప్పటికప్పుడు సంస్థకు డబ్బులు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పెండింగులో ఉన్న విద్యుత్ బకాయిలు సైతం చెల్లించామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, రాఘవులు, పల్లేని రవీందర్‌రావు, మ్యాకల రవీందర్, మిట్టపెళ్లి కిష్టయ్య, ఎంపీటీసీలు చాడ చైతన్య-కొండాల్‌రెడ్డి, సర్పంచ్ తడిసిన వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కామిని వీరేశం, కాంగ్రెస్ నాయకులు భిక్షపతి నాయక్, పంతంగి రవీందర్, అనగోని శ్రీనివాస్ గుడిసె భాష్కర్, గుడిసె ఎల్లయ్య, తాళ్లపెల్లి రవి, కంకణాల చంద్రారెడ్డి, గుంటి సమ్మయ్య సీపీఐ మండల కార్యదర్శి గొంగళ్ల సదానందం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బత్తుల బాబు, మాజీ ఎంపీటీసీ ఒజ్జె కొమురయ్య, సీపీఐ నాయకులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన ఘనుడు కేసీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కోరుట్ల, జనవరి 5 : అధికారం కోసం దళితులకు మూడు ఎకరాలు, దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని నమ్మించి మోసం చేసిన ఘనుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుతో కలిసి విలేకర్ల సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడారు. చీటింగ్‌కు పేటెంట్ రైట్ కేసీఆర్‌కు దక్కుతుందని, నంబర్ వన్ 420 కేసీఆర్‌అని దుయ్యబట్టారు. మైనార్టీల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది బీఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీల ద్వార అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోంన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డులు అందజేస్తామని, బీడి కార్మికులందరికి పెన్షన్ అందుతుందని అ న్నారు. ముత్యంపేట చెక్కర కర్మాగారం త్వరలోనే తెరిపించేలా రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సరైన నిర్ణయం తీసుకుంటారన్నారు. సాగునీటి రంగంలో ప్రగతి ఉమ్మడి రాష్ట్రంలోనే జరిగిందని బీఆర్ఎస్ ప్రభుత్వం సాగునీటి రం గంలో అభివృద్ధి చేసింది శూన్యమన్నారు. నిర్మల్ జిల్లాలోని సదర్ మట్ బ్యా రేజీ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కోరుట్ల నియోజకవర్గంలో మాజీ మంత్రి రత్నాకర్‌రావు చేసిన అభివృద్ధే తప్ప విద్యాసాగర్ రావు చేసింది శూణ్యమన్నారు. కోరుట్ల ఎమ్మెల్యేగా ఉండి విద్యాసాగర్ రావు కేవలం పట్టణాలతో పాటు పలు గ్రామాలలో రోడ్లపై డివైడర్ల నిర్మాణం మాత్రమే చేసాడని ఎద్దేవా చేసారు. కాంగ్రెస్ ప్రభు త్వం ప్రజాపాలన గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందని, కేవలం ప్రభు త్వం ఏర్పడిన 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు నాయకులు మచ్చ కవిత, కొంత రాజం, తిరుమల గంగాధర్, నేమూరి భూమయ్య, నహీం పాల్గొన్నారు.

దళితబంధు పథకాన్ని కొనసాగించాలి


ఆందోళన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

పెద్దపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాం చేపట్టిన దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తూ తమకు మంజూరు చేసిన యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు బడ్జెట్ విడుదల చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం మండలం చెందిన దళిత బంధు లబ్ధిదారులు శుక్రవారం కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చి ఆందోళన నిర్వహించారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు గత ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకం కింద తమను ఎంపిక చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ రావడం వల్ల కోడ్ అమల్లోకి వచ్చిందన్నారు. ఎన్నికలు పూర్తయి పాత ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. దళిత బంధు పథకాన్ని కొనసాగిస్తూ, ఇప్పటి వరకు తమకు మంజూరైన యూనిట్లను గ్రౌండింగ్ చేసేందుకు నిధులు విడుదల చేయాలని నూతన ప్ర భుత్వాన్ని కోరారు. తమ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా తమ బాధను అర్థం చేసుకుని ప్రభు త్వంపై ఒత్తిడి తీసుక వచ్చి నిధులు మంజూరు చేయించాలని కోరారు.

జిల్లా ఆసుపత్రిని సందర్శించిన కేంద్ర బృందం

సుభాష్‌నగర్ జనవరి 5: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని టీబీ ముక్త్ భారత్ కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ఓపీ వార్డులు, ఐపీ వార్డులు, ల్యాబులు, పేషంట్ వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి డాక్టర్ ప్రమోద్‌రెడ్డి వైద్యులు, సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పేషంట్లకు అందించాల్సిన సేవలను గురించి వారికి వివరించారు. అంతేకాకుండా వెంటిలేషన్ ఎలా ఉండాలి, పేషంట్లకు కనీస సౌకర్యాలు, విధిగా మాస్కులు ధరించడం వంటి సూచనలను చేశారు. అలాగే ఆసుపత్రిలో చేయాల్సిన మార్పులు చేర్పులపై సలహాలు సూచనలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మంథని, జనవరి 5 : మంథని మున్సిపల్ పరిధిలోని కూచిరాజుపల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం.. కొడారి శంకర్ అనే వ్యక్తి టీఎస్ 25 ఈ 2941 నంబరు గల కారులో వైటింక్లయిన్ కాలనీ నుంచి భూపాలపల్లి వైపు వెళుతుండగా కూచిరాజుపల్లి వద్ద టైరు పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి అక్కడే ఉన్న గొర్రెల మందను, కాపరి చెల్కల తిరుపతి, మంథని నుంచి ద్విచక్రవాహనంపై వెళుతున్న పోయిల భూమరాజు అనే వ్యక్తిని ఢీకొట్టింది. గాయపడిన తిరుపతి, భూమరాజులను మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు పెద్దపల్లికి తరలించారు. ఎస్సై కిరణ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీపుల్స్‌పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతి


తిరుపతి

సుభాష్‌నగర్, జనవరి 5: పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా గంగారపు తిరుపతిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు పొతునూరి సత్యనారాయణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియమకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, జనవరి 5: బీసీ స్టడీ సర్కిల్లో గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ కరీంనగర్ జిల్లా డైరెక్టర్ డాక్టర్ ఎం రవికుమార్ తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 8 నుంచి 20 వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

బస్సును ఢీకొట్టిన కారు

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: మండలంలోని సింగాపూర్ గ్రామ శివారులోని ఎరుకులగూడెం క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం ఆర్టీసీ బస్సును ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. వరంగల్-1 డీపోకు చెందిన ఆర్టీసీ బస్సు వరంగల్ నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న క్రమంలో సింగాపూర్ గ్రామ శివారులోని ఎరుకులగూడెం క్రాస్ వద్దకు చేరుకోగానే కరీంనగర్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న ఓ కారు అతివేగంగా వచ్చి బస్సు ముందు భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాక్షికంగా ధ్వంసమైంది. ఆర్టీసీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

కాల్వశ్రీరాంపూర్, జనవరి 5: పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మొట్లపల్లిలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. సంఘాని రాజయ్య(52) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నొప్పి తగ్గకపోవడంతో గురువారం తన ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 5: శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో జరుగుతున్న డిగ్రీ 1, 3వ సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడగా వారిని డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్ వి శ్రీరంగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల హుస్నాబాద్‌లో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షల్లో ఒకరు..

తిమ్మాపూర్, జనవరి 5: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల (ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ)డైట్‌లో నిర్వహిస్తున్న డీఈఎల్ఈడీ పరీక్షల్లో ఒకరు డీబార్ అయినట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్ డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 నుండి డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డీఈఎల్ఈడీ) మొదటి సంవత్సర పరీక్షలు ప్రారంభమయ్యాయి. డైట్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కాగా రెండో రోజు శుక్రవారం సమాజం, విద్య, పాఠ్యప్రణాళిక పరీక్షలో ఒకరు కాపీకి పాల్పడుతుండడంతో డీబార్ చేశారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఇద్దరి ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 5: హరియాణ రాష్ట్రంలో ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహించే జాతీయస్థాయి ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపికయ్యారు. రామడుగుకు చెందిన సమంతుల మధు రోహిత్, నీలం సాయి కార్తీక్ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభచాటినజాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరీంనగర్ జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ నమిలకొండ ప్రభాకర్ అభినందించారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: మండలంలోని రాంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న భరత్ అనే విద్యార్థి ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఇన్‌చార్జీ హెచ్‌ఎం సురేందర్, వ్యాయామ ఉపాధ్యాయుడు వేముల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో నిర్వహించే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థి పాల్గొనన్నుట్లు తెలిపారు.

బురదలో జారిపడి ఒకరి మృతి


కుమారస్వామి(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శుక్రవారం వ్యవసాయ క్షేత్రంలోని బురదలో కాలుజారిపడి మృతి చెందాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టల కుమారస్వామి(40) అనే వ్యక్తి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మూ డేళ్ల క్రితమే భార్య చనిపోయింది. వీరికి కుమారుడు(10) ఉన్నాడు. భార్య చనిపోయిందన్న దిగులుతో పిట్టల కుమారస్వామి మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 4న ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. శుక్రవారం పిట్టల భాగ్యమ్మ అనే మహిళ పొలం పనులు చేసేం దుకు వెళ్లగా బురదలో పడి ఉన్న కుమారస్వామిని చూసి స్థానికులకు తెలియ జేసింది. స్థానికులు వెంటనే హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీ క్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీలో సమయపాలన పాటించాలి

మండల వైద్యాధికారికి గ్రామస్తుల వినతి

మెట్‌పల్లి రూరల్, జనవరి, 5 : మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో సిబ్బంది సమయపాలన పాటించక పోవ డంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డికి పిఎసీలోని సమస్యలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తెలియజేసి వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హస్పిటల్ పర్యవేక్షణ లోపంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఆసుపత్రిలోని పరికరాలు నిరుపయోగంగా మారాయని ఆరోపించారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, మార్చడం వెనుక దాని కారణమేమిటని, పరికరాలు నిరుపయోగంగా ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అలాగే సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చూసి పరికరాలను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పల్లికొండ ప్రవీణ్, నక్క శివకుమార్, రఘు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తరిస్తాం



కంటి పరీక్షలు చేస్తున్న రేకుర్తి సిబ్బంది

మెట్‌పల్లి, జనవరి, 5 : లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని మెట్‌పల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షులు దొంతుల ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్ర వారం పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 80మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 30 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి కంటి ఆసుపత్రికి పంపనున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా నిరుపేద విద్యార్థులకు నోటుపుస్తకాలను అందజేయడమే కాకుండా వృద్ధులకు చలికాలంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని లయన్స్ సేవలను మరిం తగా విస్తరించడానికి కృషి చేస్తామన్నారు. లయన్స్‌క్లబ్ సభ్యులు కోటగిరి తిరుమలాచారి, ఇల్లెందుల శ్రీధర్, శ్రీనివాస్, పోలీస్ శ్రీనివాస్, ఆల్‌రౌండర్ గంగాధర్, అరుణ్‌దీప్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నేతలు

కోరుట్ల, జనవరి 5 : పట్టణంలోని పలువార్డులకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం పట్టణం లోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు సమక్షంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ గడ్డమీది పవన్, కౌన్సిలర్ లోకిని వెంకటేష్, నాయకులు అడెపు మధు, మహ్మద్ రహీం, సుప్రీం కోర్టు న్యాయవాది గడ్డమీది వేణు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండవా కప్పి ఆహ్వానించారు. ఇప్పటికే 25వ వార్డు సభ్యుడు ఏంబేరీ నాగభూషణం, మాజీ కౌన్సిలర్ల సేనాపతి రాజు, రియాజ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తాం

బ్యాంక్ మేనేజర్ రజిత

కొడిమ్యాల, జనవరి 5 : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే కేంద్ర సహకార బ్యాంక్ లక్ష్యమని కొడిమ్యాల బ్రాంచ్ మేనేజర్ రజిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రజలు బ్యాంక్ సేవలు పొందాలని, సహకార క్రాంతి డిపాజిట్లపై గ్రామంలోని ప్రజలకు అవగాహన కలిపించారు. అనంతరం మేనేజర్ విలేకరులతో మాట్లాడుతూ లాకర్ సౌకర్యం, నెట్ బ్యాంకింగ్, గోల్డ్ లోన్, ఎడ్యుకేషన్‌లోన్ సౌకర్యం ఉందన్నారు. ఉచిత అకౌంట్ స్టేట్‌మెంట్ సదుపాయం కలిపించడంతో పాటుగా, నగదు డిపాజిట్లపై ఎలాంటి హాడ్లింగ్ చార్జీలు లేవన్నారు. డిపాజిట్లపై 5లక్షల వరకు ఇన్సూరెన్స్ భద్రత కలిపించామన్నారు. కేడీసీసీ బ్యాంక్‌లో డిపాజిట్ చేసుకున్న వారికి 7.50 శాతం, సీనియర్ సీటిజన్లకు 8 శాతం వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ప్రవేశ పెట్టిన సహకార క్రాంతి డిపాజిట్ పథకాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని మేనెజర్ కోరారు. బ్యాంక్ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, సిబ్బంది రాహుల్, కొడిమ్యాల సింగిల్ విండో సీఈవో గంగాధర్, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సమస్యల సాధన కోసమే అభివృద్ధి ఫోరం ఏర్పాటు

కోరుట్ల, డిసెంబరు 5 : పట్టణంలో పేరుకుపోయిన సమస్యల సాధన కోసమే కోరుట్ల అభివృద్ధి ఫోరం ఏర్పాటు చేసినట్టు ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు చెన్న విశ్వనాథం, పేట భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం ఫోరం కరపత్రాలను సభ్యులతో కలిసి సి ప్రభాకర్ భవన్ గ్రంథాలయంలో విడుదల చేశారు. కోరుట్ల డివిజన్, రెండవ గ్రేడ్ మున్సిపాలిటీ, నియోజకవర్గ కేంద్రంగా ఏర్పడినప్పటికీ అభివృద్ధిలో పూర్తిగా వెనకబడి పోయిందన్నారు. పూర్తిస్థాయిలో అధికారులు, కార్యాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పది డిమాండ్ల సాధన కోసం ఏర్పడిన ఈ ఫోరంలో మేధావులు, విద్యార్థులు, పార్టీలకతీతంగా నాయకులు, యువత ఫోరంలో చేరాలని కోరారు. ఈ సందర్భంగా రుద్ర శ్రీనివాస్, రాసకొండ పెద్దదేవయ్య, రంజిత్‌కుమార్, విజయ్, రాంబాబు, రమేశ్, నగేశ్, అంజయ్య ఉన్నారు.

ఆటపాటలతో గడిపిన ఆర్టీసీ ఉద్యోగులు

కోరుట్ల, జనవరి 5 : ఆర్టీసీ ఉద్యోగులు శుక్రవారం ఆట పాటలతో గడిపి ఉల్లాసంగా గడిపారు. శుక్రవారం డిపో మేనేజర్ విజయ్ మాధురి ఆధ్వర్యంలో వనబోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులకు వనబోజన కార్యక్రమాన్ని నిర్వహించి సహా పంక్తి బోజనంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఆటల పోటీలలో రాణించిన ఉద్యోగులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు పాల్గొన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యేను కలిసిన నాయకులు

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కరీంనగర్‌లోని ఆయన స్వగృహంలో ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. నాయకులు కొండూరి గాంధీరావు, తిరుపతి, నర్సయ్య, లక్ష్మారెడ్డి, మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

అయోధ్యరాముని అక్షింతలతో శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

మెట్‌పల్లి, జనవరి, 5: శ్రీ రామ జన్మ భూమి అయోధ్య నందు పూజింపబడిన అక్షింతలతో శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలో శోభాయాత్రను నిర్వహించారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో రాముల వారి అక్షింతలను గోల్ హనుమాన్ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి రామ సంకీర్తనలు, భజనలతో శోభాయాత్రగా 19, 26 వార్డుల్లోకి శోభయాత్రగా బయలు దేరారు. శోభయాత్రలో మహిళలు మంగళహారతులతో స్వాగతం పలుకుతూ ఇంటింటి అక్షింతలను వితరణ చేశారు. కాగా స్థానిక మున్సిపల్ అధ్యక్షురాలు రాణవేని సుజాత శోభాయాత్రలో పాల్గొని అక్షింతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో బోడ్ల రమేశ్, జోగ రాజగంగారాం, సుతారి లింగారెడ్డి, జెట్టి రూపేష్, బొడ్ల ఆనంద్, బోడ్ల గౌతం, భూమారెడ్డి, మధు, రాము, సంజీవ్, ప్రసాద్, కలిగోట శ్రీకాంత్,లత పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని వివిధ గ్రామాల్లో, మండల కేంద్రంలో గత ఐదు రోజులుగా శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి వచ్చిన అయోధ్య రామ అక్షింతలను కరసేవకులు పంపిణీ చేస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయంలో పండితులు అక్షింతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి గ్రామంలో ఇంటింటికి తిరు గుతూ అక్షింతలను కరసేవకులు పంపిణీ చేశారు.

ఘనంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

●గజమాలతో సత్కరించిన అభిమానులు

●పాల్గొన్న ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి



కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేస్తున్న జీవన్ రెడ్డి

జగిత్యాల టౌన్, జనవరి 5 : జిల్లా వ్యాప్తంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు గిరి నాగభూషణం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించగా జీవన్‌రెడ్డి హాజరై కాంగ్రెస్ నాయకులు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. భారీ క్రేన్ సహాయంతో రెండు వందల కిలోలకు పైగా ఉన్న పూలమాలను 25వ వార్డుకు చెందిన రజనీకాంత్‌తో పాటు అభిమానులు జీవన్‌రెడ్డికి అలకం రించి షాలువాలతో ఘనంగా సన్మానించారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ మధు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పలు వార్డుల్లో రోగులకు జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ చివరి క్షణం వరకు ప్రజా జీవితానికే అంకితమవుతానన్నారు. ప్రజలు చూపే అభిమానం ఎనలేని తృప్తిని ఇచ్చిందని వివరించారు. పదవులు ప్రధానం కాదని, ప్రజల అభిమానమే ప్రధానమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ శంకర్, మహంకాళి రాజన్న, గాజుల రాజేందర్, అల్లాల రమేష్ రావు, కల్లెపల్లి దుర్గయ్య, నక్క జీవన్ కుమార్, కమటాల శ్రీనివాస్, పులి రాము, లైశెట్టి విజయ్, బండ భాస్కర్ రెడ్డి, చిట్ల అంజన్న, కమాల్, పుప్పాల అశోక్, జుల్‌ఫేకర్, ముస్కు నిశాంత్ రెడ్డి, మామిడి మహిపాల్, రెపల్లె హరికృష్ణ, దయాల శంకర్, కర్నె భూమారెడ్డి, రమణ, నందయ్య, శ్రీనివాసరెడ్డి, రాజేందర్, రమేష్ ఉన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని ఒడ్డె లింగాపూర్, ఇటిక్యాల గ్రామాల్లో గురువారం ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంగడిబజార్‌తో పాటు 4వ వార్డులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో జీవన్‌రెడ్డి పేరిట ప్రత్యేక పూజలు చేయడంతో పాటు వృద్ధులకు పండ్ల ను పంపిణీ చేశారు. భూపతిపూర్ గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్థుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేష్, నియోజకవర్గ యూత్ కన్వీనర్ కొయ్యడి మహిపాల్, ఎద్దండి దివాకర్, పట్టణ మహిళా అధ్యక్షురాలు మమత, పట్టణ యూత్ అధ్యక్షుడు బత్తిని నాగరాజు, నాయకులు ఎద్దండి భూమారెడ్డి, ప్రభాకర్, నర్సయ్య పాల్గొన్నారు.



భూపతిపూర్‌లో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



గజమాలతో ఎమ్మెల్సీని సన్మానిస్తున్న అభిమానులు, పాల్గొన్న అడ్లూరి

సారంగాపూర్ : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా దుబ్బరాజన్న ఆలయంలో మండల కాంగ్రెస్ నాయకులు పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు కొండ్ర రాంచందర్‌రెడ్డి, సర్పంచ్ బొడ్డుపెల్లి రాజన్న, జమున రాజిరెడ్డి పాల్గొన్నారు.

బీర్‌పూర్ : మండలకేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఎమ్మెల్సీ పేరుమీద ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్‌రావ్, జడ్పీటీసీ పాత పద్మ రమేష్, కాంగ్రెస్ ప్రచారకమిటీ కన్వీనర్ జితేందర్ యాదవ్, మండల అధ్యక్షులు చెరుపూరి సుభాష్ యాదవ్ పాల్గొన్నారు.

వెల్గటూర్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం వెల్గటూర్ సర్పంచ్ మేరుగు మురళి ఆధ్వర్యంలో మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పూల గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రావు, మండల బీసీ సెల్ అధ్యక్షుడు బందెల ఉదయ్, కొండ లక్ష్మినారాయణ, సంతోష్, అజయ్, సంజయ్ పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జనవరి 5: అర్హులైన లబ్ధిదారులకే ప్రభుత్వ పథకాలు అందిస్తామని, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని జైనా, దొంతాపూర్ గ్రామాల్లో, ధర్మపురి పట్టణంలోని 11, 14, 15వ వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గ్యారెంటీ పథకాలను వంద రోజుల్లో అమలు చేస్తామన్నారు. రేషన్‌కార్డు, వార్డు, ఇతర సమస్యల గురించి కూడా దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. గోదావరి పరివాహక ప్రాంతంలో సాగు నీరు అందడం లేదని, ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా కోసం ఉన్నతాధికారులతో మాట్లాడాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ అర్హులకు లబ్ది చేకూరేందుకు అధికారులు పని చేయాలన్నారు. ప్రజా పాలన నిర్వహణ కోసం 190 టీమ్ లు ఏర్పాటు చేసి 3500 కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్ చేయడం కోసం 500 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, కలెక్టర్ కలిసి కల్యాణ లక్ష్మి పథకం కింద 10 మంది లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిన్నారులకు అన్న ప్రాసన చేశారు. జగిత్యాల ఆర్‌డీవో నరసింహామూర్తి, ధర్మపురి నియోజకవర్గ ప్రత్యేక అధికారి లక్ష్మినారాయణ, మండల ప్రత్యేక అధికారి ఎండీ రహమాన్, ఎంపీపీ చిట్టిబాబు, జడ్పీటీసీ అరుణ, సర్పంచులు ఎంపీటీసీలు, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

పట్టణంలోని వార్డుల్లో ప్రజా పాలన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ రమేష్, వైస్ చైర్మన్ ఇందారపు రామయ్య, ప్రత్యేక అధికారి రాహుల్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మల్యాల: ప్రజాపాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా ప్రత్యేక అధికారి శ్రీదేవసేన మండలంలోని గొల్లపల్లిలో పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది, అక్కడి పర్యవేక్షణ అధికారులతో మాట్లాడి పకడ్బందిగా చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేషం, ఎంపీవో వాసవి, ఆర్‌ఐ తిరుపతి, సర్పంచ్ యాదమ్మ పాల్గొన్నారు

జగిత్యాలరూరల్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రకటించిన అభయ హస్తం, ఆరుగ్యారంటీ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని పల్లె ప్రగతి రాష్ట్ర పరిశీలకురాలు దేవసేన అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని ఒడ్డెరకాలనీలో జరిగిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని దేవసేన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం, గ్యారంటీ పథకాలను అర్హులైన పేద ప్రజలు అందిపుచ్చుకోవాలన్నారు. రశీదులను భద్రపరుచుకోవాలని సూచించారు. రానున్న కాలంలో పథకాలను మంజూరుచేసే సమయంలో రశీదులను చూపించాల్సి ఉంటుందని సూచనప్రాయంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికసంస్థల అదనపుకలెక్టర్ టి. ఎస్ దివాకర, ఆర్డీవో నర్సింహమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజు, ఎంపీడీవో రాజేశ్వరి, ఎంపీవో రవిబాబు, స్థానిక మండల, గ్రామఅధికారులు పాల్గొన్నారు.

కథలాపూర్: ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని రాజారాం తండాలో సదస్సు జరిగింది. ఐదు గ్యారంటీలకు సంబంధించి 98 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించామని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ తౌఖీర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మోహన్‌నాయక్, సర్పంచ్ లావుడ్య సరితరవి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరూ దరఖాస్తులు చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శుక్రవారం మండలంలోని రంగారావుపేట, విట్టంపేట గ్రామాల్లో జరుగుతున్న ప్రజాపాలన కార్యక్రమ్నా పరిశలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు పరుచనున్న ఆరు గ్యారెంటీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధికారులు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, మహిళలు, అధికారులు పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న దేవసేన

బీర్‌పూర్: మండలంలోని చెర్లపెల్లి, చిత్రవేణిగూడెం గ్రామాలలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాలను టీమ్ లీడర్లు తహసీల్దార్ నరేష్, ఎంపీవో రామకృష్ణ రాజు ప్రారంభించారు. గ్రామాల ప్రజలు అభయ హస్త కోసం దరఖాస్తులు చేసుకోగా అధికారులు దరఖాస్తులు స్వీకరించి రసీదులు అందించారు. ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని తురుకకాశీనగర్, గౌరాపూర్, సూరంపేట గ్రామంలో ప్రజాపాలన దరఖాస్తులను ఏడవ రోజు శుక్రవారం ప్రత్యేక అధికారులు ఎంపీడీవో పద్మజారాణి, తహసీల్దార్ రవికాంత్, ఏఈఈ మణిదీప్ ఆధ్వర్యంలో సిబ్బంది స్వీకరించారు. దరఖాస్తు కేంద్రాలను ప్రత్యేక అధికారి ప్రతాప్‌సింగ్ పరిశీలించారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీవో ప్రవీణ్, సీనియర్ అసిస్టెంట్ సురేష్ పాల్గొన్నారు.

పెగడపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమ గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి ఎంపీడీవో జె.పుల్లయ్య, తహసీల్దార్ ఎం.ఏ.ఫారూక్‌లు కోరారు. మండలంలోని ఏడుమోటలపల్లి, బతికెపల్లి, దీకొండ గ్రామాలలో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించి ప్రజల నుంచి అభయ హస్తం ఆరు గ్యారంటీల అమలు కుగాను దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమాలలో ఎంపీవో మహేందర్, సర్పంచులు రవినాయక్, శోభారాణి, భాగ్యలక్ష్మి, ఎంపీటీసీలు అంజయ్య, అనసూర్య, లచ్చయ్య, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రజాపాలన కార్యక్రమం శుక్రవారం కోనసాగుతుంది. ఈ సందర్భంగా 25, 26వ వార్డులలో ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆయా వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించి, అర్జిదారులకు దరఖాస్తు ఫారంలను అందజేసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామన్నారు. అనంతరం పలువురు ప్రజాప్రతినిధులు జువ్వాడి నర్సింగరావును శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషినర్ జగదీశ్వర్‌గౌడ్, నాయకులు తుమ్మనపెల్లి రాంప్రసాద్, పూదరి రాముగౌడ్, సోమిడి శివ, షేక్‌మహ్మద్, ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

హద్దులు నిర్ణయించాలి

ఎల్లారెడ్డిపేట, జనవరి 5: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సమీపంలో ఉన్న తిమ్మాసుకుంటకు హద్దులు నిర్ణయించాలని కోరుతూ మాజీ ఎంపీటీసీ బాలరాజుయాదవ్ శుక్రవారం తహసీల్దార్ రాంచందర్‌కు వినతి పత్రం అందజేశారు. కొందరు రైతులు కుంటను ఆక్రమించుకుంటున్నారని పేర్కొన్నారు. హద్దులు నిర్ణయించి కబ్జాకు గురి కాకుండా చూడాలని బాలరాజుయాదవ్ కోరారు.

రాజన్న సేవలో జలశక్తి అభియాన్ సెంట్రల్ నోడల్ అధికారి

వేములవాడ, జనవరి 5: వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని జలశక్తి అభి యాన్ సెంట్రల్ నోడల్ అధి కారి గణేష్ కుమార్ భరణ్వాల్ శుక్రవారం దర్శించుకున్నారు. స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చ కులు ఆశీర్వచనం ఇవ్వగా, ప్రొటోకాల్ పర్యవేక్షకుడు సిరిగిరి శ్రీరాములు ప్రసాదం అందజేశారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామిని పెద్దపల్లి ఎన్నికల వ్యయ పరిశీలకుడు ఆశిష్ యాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

ఎంపీటీసీల క్యాంప్ రాజకీయాలు

● పది రోజుల క్రితమే సభ్యుల తరలింపు

● 10న అవిశ్వాసంపై సమావేశం

మల్యాల, జనవరి 5: మల్యాల ఎంపీపీ విమలపై ఎంపీటీసీ సభ్యులు అవిశ్వాస తీర్మానం అందజేయడంతో ఎంపీటీసీలను క్యాంప్‌నకు తరలించారు. అవిశ్వాసం నెగ్గేందుకు క్యాంప్ రాజకీయాలు చర్చనీయాంశంగా మారగా ఈ నెల 10న అధికారులు అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేశారు. దీంతో ఎంపీటీసీలు చేజారకుండా ముందస్తుగా పది రోజల క్రితమే క్యాంప్‌నకు తరలించారు. బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ పది మంది ఎంపీటీసీలు గత నెల 20న జగిత్యాల ఆర్డీవో నర్సింహమూర్తికి నోటీస్ అందజేశారు. మండలంలో 14 ఎంపీటీసీ స్థానాలకు గాను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ 8, కాంగ్రెస్ 2, బీజేపీ 3, స్వతంత్రులు ఒకరు గెలుపొందారు. దీంతో బీఆర్ఎస్ ఎంపీపీ పీఠం దక్కించుకుంది. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన మల్యాల-1, రామన్నపేట ఎంపీటీసీ సభ్యులు కాంగ్రెస్‌లో, పోతారం స్వతంత్ర ఎంపీటీసీ బీజేపీలో చేరారు. మొత్తం 14 మంది ఎంపీటీసీలో ఒకరు విదేశాల్లో ఉన్నారు. పది మంది ఎంపీటీసీలు ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ ఆర్డీవోకు లేఖ అందజేశారు.

● 10న ఎంపీటీసీల సమావేశం..

అవిశ్వాస నోటీస్ అందజేయడంతో ఆర్డీవో ఈ నెల 10న ఎంపీటీసీల సమావేశం ఏర్పాటు చేశారు. ఇందుకు ఇప్పటికే ఎంపీటీసీలకు ఆర్డీవో నోటీస్‌లు అందజేశారు. ఆ రోజున ఎంపీపీపై పది మంది ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటిస్తే వైస్ ఎంపీపీకి ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. అవిశ్వాసం నెగ్గకుండా నోటీస్ అందజేసిన పది మంది ఎంపీటీసీలలో ఇద్దరిని ప్రస్తుత ఎంపీపీ క్యాంప్‌నకు తరలించినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా మిగిలిన 8మంది ఎంపీటీసీలకు మరొక ఎంపీటీసీ తోడు కాగ ఎంపీపీ క్యాంప్‌లోని ఇద్దరు కూడా 9మందికి జత కూడనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో మండల వ్యాప్తంగా దీనిపై ఆసక్తి నెలకొంది.

● కేవియట్ దాఖలు చేసిన సభ్యులు

నోటీస్ అందజేసిన ఎంపీటీసీలు న్యాయస్థానానికి ఆశ్రయించి కేవియట్ దాఖలు చేశారు. అవిశ్వాసం నిరాటంకంగా సాగడానికి సభ్యులు కోర్టుకు వెళ్లినట్లు తెలుస్తోంది. అవిశ్వాసం నోటీస్ అందజేసిన అనంతరం ఎంపీపీ కోర్టు నుంచి స్టే తీసుకువచ్చే అవకాశం ఉండడంతో స్టే రాకుండా ఉండడం కోసం కేవియట్ దాఖలు చేసినట్లు పలువురు నాయకులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే అవిశ్వాసం నోటీస్ అందజేసిన వారిలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సభ్యులు ఉండగా ఎంపీపీపై అవిశ్వాస రాజకీయం మండల వ్యాప్తంగా చర్చనీంశంగా మారింది.

● 12న సర్వసభ్య సమావేశం..

ఇదిలా ఉండగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 12న నిర్వహించడానికి మండల పరిషత్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత నెల 20నే ఎంపీటీసీలు ఆర్డీవోకు అవిశ్వాస నోటీస్ అందించగా 10 సమావేశం ఏర్పాటు చేశారు. మరుసటి రెండు రోజులకే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయగా సమావేశ ఎజండా నోటీస్‌లు ఎంపీటీసీలకు అందని పరిస్థితి ఏర్పడింది. సభ్యులంతా క్యాంప్‌లో ఉండగా నోటీస్‌లు వారి ఇళ్ల వద్ద అందజేస్తున్నారు. నేరుగా సభ్యులకు అందలేని పరిస్థితి నెలకొంది. 12నాటి సమావేశంపై పలువురు సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన కాంగ్రెస్ నేత

కథలాపూర్, డిసెంబరు 5 : తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల మాజీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను మాజీ డీసీసీ సభ్యులు చెదలు సత్యనారాయణ ఢిల్లీలో కలిశారు. రాబోవు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కష్టపడాలని సూచించినట్టు చెప్పారు. వైఎస్సార్‌టీపీని కాంగ్రెస్‌లో విలీనం చేసిన నేపథ్యంలో పార్టీలో కీలక పదవులు అప్పగించేలా చూస్తానని పేర్కొన్నట్టు చెప్పారు.

నర్సింహస్వామి హుండీ లెక్కింపు

కొడిమ్యాల, జనవరి 5 : మండలంలోని నల్లగొండ గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి హుండీ లెక్కింపును శుక్రవారం అధికారులు, సిబ్బంది నిర్వహించారు. స్వామివారి హుండీలో 3 లక్షల 21 వేల 398 రూపాయలు నగదు భక్తుల నుంచి సమకూరినట్లు ఆలయ ఈవో ఎ. మారుతి తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ సత్యనారాయణరావు, దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వెల్గటూర్ నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరించాలి

వెల్గటూర్, జనవరి 5: జగిత్యాల నుంచి వెల్గటూర్ వరకు నడుస్తున్న బస్సును నైట్ హాల్ట్ చేసే విధంగా పునరుద్ధరిం చాలని కోరుతూ శుక్రవారం సర్పంచ్ మేరుగు మురళి ఆధ్వర్యంలో డిపో మేనేజర్ సునీతకు వినతి పత్రం సమర్పించారు. జగిత్యాల నుండి వెల్గటూర్ వరకు బస్సును కొన సాగిస్తూనే గతంలో మాదిరిగా వెల్గటూర్‌లో నైట్ హాల్ట్ చేసి ఉదయం జగిత్యాలకు వెళ్లే విధంగా బస్సు సౌకర్యం కల్పించి ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా చూడాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్య క్రమంలో సందీప్‌రెడ్డి, ఉదయ్, శ్రీకాంత్‌రావు పాల్గొన్నారు.

గోపులాపూర్‌లో రక్తదాన శిబిరం

బుగ్గారం , జనవరి 5: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం గోపులాపూర్‌లో కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, ఓయు జేఏసీ చైర్మన్ కండ్లె మధన్, గోవిందుల రమణ, బీర్నార్ తిరుపతి, నగునూరి నర్సగౌడ్, అంజిత్ కుమార్, శంకర్, చంద్రయ్య, రంజిత్, శ్రీనివాస్, శంకర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మల్యాల, జనవరి 5: మండల పురగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో రుపొందించిన నూతన సంవత్సర క్యాలెం డర్‌ను మల్యాల సీఐ కోటేశ్వర్, మల్యాల, పెగడపల్లి ఎస్సైలు కుమారస్వామి, సతీష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నల్లపు మల్లేశం, పోతరాజు శ్రీనివాస్, శ్రీధర్, కోటే మల్లేశం, తిరుపతి, అంజయ్య, రవి పాల్గొన్నారు

ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

మల్లాపూర్, జనవరి 5 : మండలంలోని వివిరావుపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 12వ సంవత్సరాల నుంచి పని చేసిన ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణకు ఘనంగా విడ్కోలు పలికారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ విద్యాలయ అవార్డుతో పాటు ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు. అదే విధంగా విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ, ప్రణాళికతో ఎంతో మార్పులు తెచ్చి ఎన్నో ఐఐటీ సీట్ల వచ్చేలా కృషి చేశాడన్నారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల చదువుకు ఎంతో కృషి చేయడంతో గ్రామస్తులు, యువకులు, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం వినూత్నంగా కార్‌పై ర్యాలీగా తీసుకొస్తూ పూల వర్షం కురిపిస్తూ వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో ఇరు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, యువకులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

కథలాపూర్, డిసెంబరు 5 : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి శుక్రవారం కథలాపూర్ కాంగ్రెస్ నాయకులు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు అల్లూరి దేవన్న, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, రాష్ట్ర ఫిషరీస్ విభాగం ప్రధాన కార్యదర్శి కల్లెడ గంగాధర్ ఉన్నారు.

అదనపు బస్సులు నడపాలి

సిరిసిల్ల టౌన్, జనవరి 5: ప్రతీరోజు ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థుల సౌకర్యార్థం అదనపు బస్సులు నడపాలని కోరుతూ శుక్రవారం బీఆర్ఎస్వీ నాయకులు సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ మా ట్లాడుతూ ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయంలో విద్యార్థులు గ్రామాల నుంచి జిల్లా కేంద్రంలోని కళాశాలలు, పాఠశాలలకు రావడానికి, పోవడానికి బస్సులు వేయక పోవ డంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. బీఆర్ఎస్వీ నాయ కులు మట్టె శ్రీనివాస్, నవీన్, జగన్, భాను, నరేష్, తిరుపతి, రాకేష్, సంపత్, కార్తిక్, ఆశీర్వాద్, రాహుల్ పాల్గొన్నారు.